క్లుప్తంగా

నేడు నగర, గ్రామ సంకీర్తన

పాల్వంచరూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద అమ్మవారితో నగర, గ్రామ సంకీర్తన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యుడిగా విజయభాస్కర్

జూలూరుపాడు: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జూలూరుపాడుకు చెందిన పెండ్యాల విజయభాస్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నట్లు చెప్పారు. సంఘం అభివృద్ధి కోసం 25 ఏళ్లుగా కృషి చేస్తున్నట్లు చెప్పారు.

సీఐ బదిలీ



వినయ్‌కుమార్

పాల్వంచ: పాల్వంచ సీఐగా వి.వినయ్‌కుమార్ నియామకం అయ్యారు. వరంగల్ కమిషనరేట్ వీఆర్‌లో ఉన్న వినయ్‌కుమార్ బదిలీపై పాల్వంచ రానున్నారు. వారం రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది. ఎన్నికలు దగ్గర పడుతున్న క్రమంలోనే సీఐ నాగరాజు ఎనిమిది నెలల్లోనే బదిలీ అయ్యారు.

కొత్తగూడెంటౌన్: పాల్వంచ సీఐ మడిపెల్లి నాగరాజును కొత్తగూడెంలోని డీసీఆర్బీ వేకెన్సీలో పోస్టింగ్‌కు కేటాయించారు. ఈ మేరకు బుధవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సీఐ ఉపేందర్ బదిలీపై డోర్నకల్‌కు వెళ్లారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి భూమి పూజ

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం వద్ద బుధవారం దాతలు ఇచ్చిన రూ.62లక్షల నిధులతో నిర్మాణం చేయనున్న అన్నదాన సత్రం నిర్మాణ పనులకు దాతలు నూతక్కి శ్రీనివాస్ దంపతులు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన రాజేశ్వరరావు, నాగలక్ష్మీ దంపతులు, తవుడుశెట్టి రాజ్యలక్ష్మీ దంపతులు ఒక్కొక్కరు రూ.10 లక్షల చొప్పున విరాళం అందజేస్తామని ప్రకటించినట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, ధర్మకర్త ఎస్వీఆర్‌కే ఆచార్యులు, కిలారు నాగమల్లేశ్వరరావు, చింత నాగరాజు, గంధం వెంగళరావు, సంకా వెంకటరామారావు, పాయంపాపయ్య పాల్గొన్నారు.

డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఇల్లెందు: సింగరేణి – తెలంగాణ ఆర్టీసీ సంయుక్తంగా నిరుద్యోగ యువతకు లైట్ మోటార్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఏరియా జీఎం షాలేమురాజు తెలిపారు. బుధవారం ఇల్లెందులో మాట్లాడుతూ.. కోల్‌బెల్ట్ ప్రాంత యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా సిరిసిల్లలో 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు జీఎం ఆఫీస్ సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

భారీగా దరఖాస్తులు

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాలకు ఇచ్చే రూ.లక్ష రుణం కోసం స్థానికులు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం తహసీల్దారుకు పెద్దమొత్తంలో దరఖాస్తు చేసుకుంటున్నారు. మూడురోజులుగా ఆన్‌లైన్ సర్వర్ సక్రమంగా పనిచేయకపోవడంతో దరఖాస్తులు పేరుకపోతున్నాయి. ఒకవైపు ప్రభుత్వం 20వ తేదీ గడువు ప్రకటించడంతో అభ్యర్థులకు సకాలంలో ధృవీకరణ పత్రాలు జారీ కాక ఆందోళన చెందుతున్నారు. మండలంలో మూడువేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రంగాప్రసాద్ తెలిపారు.

పడుతూ.. లేస్తూ.. పల్లె ప్రగతి

పల్లె ప్రగతి.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల సమగ్రాభివృద్ధి కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అద్భుతమైన పథకం.. 2019 సెప్టెంబర్ 5న తొలిసారి అట్టహాసంగా ప్రారంభించారు. ప్రతినెలా గ్రామపంచాయతీలకు నిధులు అందించడంతో పనులు చకచకా జరిగాయి. ప్రజాప్రతినిధులు సైతం అంకితభావంతో ప్రభుత్వ ఆకాంక్షకు అనుగుణంగా పనులు చేయించారు. ఇందులో భాగంగా జిల్లా స్థాయి అవార్డుల ఉత్సవంలో జిల్లా ఉత్తమ గ్రామపంచాయతీ, ఉత్తమ పంచాయతీ కార్యదర్శి అవార్డులను ఇల్లెందు మండలమే దక్కించుకుంది. ఇంతచేసినా ప్రజాప్రతినిధులకు తమ పాలనాకాలం చివరికి వచ్చేసరికి అప్పులే మిగిలాయి. బిల్లుల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు.

- ఆరంభంలో నిధుల వరద.. వేగంగా పనులు
- నేడు నిధుల కొరత.. ప్రతినిధులకు అప్పుల భారం
- అధికారుల కనుసన్నల్లోనే దశాబ్ది ఉత్సవాలు
- సర్పంచ్‌లకు తెలియకుండానే ఖజానా ఖాళీ


పోచారంతండా గ్రామం వ్యూ

ఇల్లెందురూరల్: పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రతినెలా పల్లె ప్రగతి పేరుతో నిధులు విడదలయ్యాయి. మూడు నెలలకోసారి ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేశారు. పారిశుద్ధ్య పనులు, పంచాయతీ నిధులతో పాటు జాతీయ ఉపాధి హామీ పథకం అనుసంధానంతో శ్మశానవాటికలు, చెత్త నిల్వ కేంద్రాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రతి వనాలు, మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు రూపుదిద్దుకున్నాయి. పాతబావులను పూడ్చివేశారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను కూల్చివేశారు. ట్రాక్టర్లు, ట్యాంకర్లు, ట్రాలీలు కొనుగోలు చేశారు. ప్రతి గ్రామపంచాయతీలోనూ నర్సరీలను ఏర్పాటు చేశారు. హరిత హారం పథకంలో భాగంగా ఇంటింటికీ ఆరు మొక్కలు పంచారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో విరివిగా మొక్కలు నాటారు. ఇందుకు గాను మండలంలోని 29 గ్రామపంచాయతీలకు గడిచిన నాలుగున్నరేళ్లగా ప్రభుత్వం నుంచి రూ.8.39 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటి వరకు రూ.5.41 కోట్లు ఖర్చు చేసినట్లు అధికారులు తమ నివేదికల్లో వివరిస్తున్నారు.

నిధుల లేమితో ఢీలా..

పల్లెప్రగతి పథకం ప్రారంభమైన ఏడాదికే కరోనా విలయతాండవం చేయడంతో కొంతకాలం పాటు పనులు కొంత నిదానంగా సాగాయి. కరోనా తగ్గుముఖం పట్టిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అంతర్గతంగా చోటుచేసుకున్న వివాద ప్రభావం పల్లెలపై పడింది. దాదాపు ఎనిమిది నెలలపాటు కేంద్ర ప్రభుత్వం నిధుల మంజూరును నిలిపివేయగా రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయలేని పరిస్థితి. దీంతో పల్లెప్రగతి పథకం పేరుతో పనులు చేసి అభివృద్ధి పనులు చేయించిన ప్రజాప్రతినిధులు అప్పులపాలయ్యారు. నేటికీ ఆ అప్పులు అలాగే మూలుగుతుండంతో రాష్ట్ర వ్యాప్తంగా కొంత మంది బలవన్మరణం పొందిన సంఘటనలు కూడా ఉన్నాయి. మరికొంత మంది ఆస్థులు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

నిరుత్సాహంగా ప్రజాప్రతినిధులు..

ప్రారంభంలో ఉత్సాహంగా పనిచేసిన ప్రజాప్రతినిధులు చివరకు తమకు అప్పులే మిగలడంతో నిరుత్సాహానికి గురయ్యారు. దీంతో తమ బాధ్యతలను మొక్కుబడిగా చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. దీనివల్ల ప్రధానంగా పల్లె ప్రకృతి వనాలు, అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణ లేక ఎండిపోతున్నాయి. కంపోస్టు షెడ్లలో ఎరువు తయారీకి స్వస్తి చెప్పారు. పారిశుద్ధ్య పనులు సైతం అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. ఇంటింటా చెత్తసేకరణ మొక్కుబడిగా సాగుతోంది. సీసీ రోడ్లు సైతం పర్యవేక్షణ లేక మూన్నాళ్ల ముచ్చటగానే దర్శనమిస్తున్నాయి.




మిట్టపల్లిలో చెత్త సేకరిస్తున్న కార్మికులు

అవమానాలతో ముగింపు..

గ్రామపంచాయతీలకు నాలుగున్నరేళ్లపాటు అంకితభావంతో సేవలందించిన ప్రజాప్రతినిధులు తమ పాలన చివరిలో అవమానాలను ఎదుర్కొంటున్నారు. గ్రామపంచాయతీలకు మంజూరయ్యే నిధులను డ్రా చేయాలంటే గ్రామపంచాయతీ పాలక వర్గ తీర్మానం, సర్పంచ్ సంతకంతో నోట్‌ఫైల్ జత చేయాలి. కానీ అటువంటివి ఏమీ లేకుండానే నిధులు డ్రా చేస్తున్నారు. డిజిటల్ కీ రూపొందించినప్పటి నుంచి ప్రారంభమైన ఈ వ్యవహారం నేడు దశాబ్ది ఉత్సవాల పేరిట ఖర్చు చేస్తున్న వ్యయం కూడా సర్పంచ్‌లకు తెలియకుండానే పంచాయతీ ఖజానా నుంచి తరలిపోతున్నాయి.

బిల్లులు ఇవ్వడం లేదు



గ్రామపంచాయతీకి రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సిన నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ ఈఎంఐ, డీజిల్ ఖర్చులకే పరిమితం చేశారు. ఇప్పటి వరకు రూ.13 లక్షలు ఖర్చు చేశాం. కానీ నిధులు మంజూరు కావడం లేదు. – మోకాళ్ళ కృష్ణ, సర్పంచ్, మాణిక్యారం

పదవి చివరలో అవమానిస్తున్నారు



గ్రామపంచాయతీ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు నిబంధనలు పెట్టారు. పంచాయతీ తీర్మానం, నోట్‌ఫైల్ ఉండాలని చెబుతున్నారు. నేడు అటువంటి ఏమీ లేకుండానే.. మాకు తెలియకుండానే దశాబ్ది ఉత్సవాల కోసం నిధులు డ్రా చేస్తున్నారు. ఇది మమ్ములను అవమానించడమే. – స్రవంతి, సర్పంచ్, తిలక్‌నగర్

అభివృద్ధికి సహకరిస్తా..


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కనకయ్య

ఇల్లెందురూరల్: గ్రామంలో అంతర్గత రహదారులు మెరుగుపడేందుకు సహకరిస్తానని జెడ్పీచైర్మన్ కోరం కనకయ్య హామీ ఇచ్చారు. మండలంలోని మామిడిగూడెం గ్రామపంచాయతీలో గ్రామస్తులతో బుధవారం సమావేశమయ్యారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు వీధులలో పర్యటించి సీసీ రహదారులకు నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తాటి యశోద, తాటి రాంబాబు, మండల రాముమహేష్, పూనెం సురేందర్, ముక్తి కృష్ణ, బోళ్ల సూర్యం, మడుగు సాంబమూర్తి, తాటి భిక్షం పాల్గొన్నారు.

'ప్రైవేటు' దోపిడీని నియంత్రించండి

కొత్తగూడెంఅర్బన్: ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని తక్షణమే నియంత్రించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.సంధ్య, కాంపాటి పృథ్వీ డిమాండ్ చేశారు. ఈ మేరకు పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం బుధవారం డీఈఓకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. ఫీజు నియంత్రణ చట్టం లేకపోవడంతో ప్రైవేట్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నాయని ఆరోపించారు.

ఆలయ కమిటీ సభ్యులకు సన్మానం


మాట్లాడుతున్న ఆలయ వేద పండితులు

పాల్వంచ: రాష్ట్ర ప్రభుత్వ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని దశావతారాలు గల శ్రీ సీతారామాలయంలో దేవాలయ నిర్మాణ కమిటీకి, సహకరించిన వారిని సన్మానించారు. బుధవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఓ రజనీకుమారి, ఆలయ మాజీ చైర్మన్ కొత్త వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ ధర్మకర్తలు చలవాది ప్రకాశ్, పెండ్యాల కృష్ణ, దోమల కిశోర్, గడ్డం గురవయ్య, రామపూడి భాస్కర్‌రావు, బచ్చు శ్రీనివాస్, కంతాల వెంకన్న, తాటిపల్లి రవి, దీపిక, రాము, ఆలయ సిబ్బంది కాశీ, శివ తదితరులు పాల్గొన్నారు.

20 రోజులుగా అంధకారం

సుజాతనగర్: మండలంలోని కొత్త అంజనాపురం గ్రామ పంచాయతీలో 20 రోజులుగా వీధి లైట్లు వెలగక చీకట్లు అలుముకున్నాయి. అకాల వర్షం, గాలిదుమ్ముతో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధి దీపాలు వెలగడం లేదు. వాటిని పట్టించుకొనే దిక్కులేదు. గతంలో తాము చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని పంచాయతీ సిబ్బంది అంటున్నారని స్థానికులు చెబుతున్నారు. మరికొద్ది రోజుల్లో వర్షాకాలం ప్రారంభం కాబోతోంది. ఇలాంటి సమయంలో వీధి దీపాలు లేకుంటే పురుగులు, క్రిమి కీటకాలతో భయంగా ఉంటుంది. ఇప్పటికైనా వీధి లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీవైఎల్ రాష్ట్ర మహాసభలు


మాట్లాడుతున్న నాగన్న

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలో జూలై 4,5వ తేదీల్లో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. బుధవారం ఇల్లెందులోని ఐతా ఫంక్షన్ హాల్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సాయిరెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ యువత చేతితో ఉందన్నారు. సమాజంలో దోపిడీ పీడనలు అసమానతలు లేని వ్యవస్థ నిర్మాణం కోసం ప్రగతిశీల యువతరం నిరంతరం ఉద్యమిస్తోందని చెప్పారు. ఈ మహాసభల విజయవంతానికి పట్టణంలోని వ్యాపారులు, వాణిజ్య, వర్గక సంఘాల వారు సహకరించాలని కోరారు. ఈ ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా సందిరి రమేష్, ఉపాధ్యక్షుడిగా దీపక్ లహోటీ, ప్రధాన కార్యదర్శిగా భూక్యా బాలు, సహాయ కార్యదర్శిగా సుధాకర్, కోశాధికారిగా తుపాకుల నాగేశ్వరరావులతో పాటు 150 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శికి తీవ్రగాయాలు

ఇల్లెందురూరల్: ఇల్లెందు – మహబూబాబాద్ ప్రధాన రహదారిలో బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మండలంలోని రేపల్లెవాడ గ్రామపంచాయతీ కార్యదర్శి భూక్యా మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించాల్సిన పల్లె ప్రగతి వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షించి రాత్రి 10:30 గంటలకు బైక్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో జెండాలవాగు సమీపంలో ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డు పక్కనే పడిపోయాడు. స్థానికులు గమనించి మోహన్‌ను ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే నాణ్యమైన విద్య


అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య ఉంటుందని, సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ ఆకాంక్షించారు. మండలంలోని సంజయ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారుల చేత బుధవారం ఎమ్మెల్యే అక్షరాభ్యాసం చేయించారు. మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో మన ఊరు – మనబడి పేరుతో ప్రభుత్వం పెద్దమొత్తంలో నిధులు ఖర్చు చేస్తోందని చెప్పారు.

ఈ పథకంలో భాగంగా పనులు పూర్తైన సంజయ్‌నగర్ పాఠశాలలో కార్పొరేట్ స్కూల్‌ను మరిపించేలా సౌకర్యాలు మెరుగుపడ్డాయని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ల మాధవరావు, వైస్‌ఎంపీపీ దాస్యం ప్రమోద్‌కుమార్, ఉపసర్పంచ్ యాకూబీ, ఆత్మ చైర్మన్ బాన్‌సింగ్, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, మండల పరిషత్తు కోఆప్షన్ సభ్యుడు ఘాజీ, ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బడిబాటలో అక్షరాభ్యాసం


ర్యాలీలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొత్తగూడెంరూరల్: బడిబాట కార్యక్రమంలో చిన్నారులకు అధికారులు అక్షరాభ్యాసం చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్‌కాలనీ గ్రామపంచాయతీ ఇందిరానగర్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం ఎం.జ్యోతి ఆధ్వర్యంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ కనకదుర్గ, సర్పంచ్ పూనెం నాగేశ్వరరావు, విద్యాకమిటీ చైర్మన్ ఎండీ.చాంద్‌పాషా, ఉపాధ్యాయులు శౌరి ఇన్నయ్య, ఇండియన్ స్కాట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ ఖాసీం, కల్యాణి, స్రవంతి, భాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పల్లెప్రగతిని ఘనంగా నిర్వహిద్దాం..

ఇల్లెందురూరల్: దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని ఎంపీడీఓ బాలరాజు అన్నారు. పలు గ్రామపంచాయతీలను బుధవారం ఆయన సందర్శించి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. మాట్లాడుతూ.. గురువారం ఉదయం ఆరు గంటలకే గ్రామంలో ప్రదర్శన నిర్వహించాలని, అక్కడి నుంచి గ్రామంలోని పల్లె ప్రకృతి వనం, డంప్‌షెడ్లను ప్రజలతో కలసి సందర్శించాలని సూచించారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో 9 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరించాలని, అనంతరం గ్రామసభ నిర్వహించి పల్లెప్రగతిలో చేపట్టిన పనులను ప్రజలకు వివరించాలని చెప్పారు. ఈ సందర్భంగా ఉత్తమ వర్కర్లను సన్మానించడంతోపాటు కార్మికులందరికీ దుస్తులు, సామగ్రి పంపిణీ చేయాలని సూచించారు.

రేపు 'పట్టణ ప్రగతి'ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16న పట్టణ ప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు. బుధవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మూడేళ్లలో సాధించిన పురోగతిని వివరించారు. వెయ్యి మందితో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నామని, పతాకావిష్కరణ, పట్టణ అభివృద్ధి నివేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మానాలు, అవార్డుల ప్రదానం తదితర కార్యక్రమాలు ఉంటాయని, సిబ్బంది కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో టీపీఓ సత్యనారాయణ, డీఈ మురళీ, ఏఈ రాజేశ్, మేనేజర్ వరప్రసాద్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జీపుజాతాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న దొడ్డా రవికుమార్

పాల్వంచ: ఐసీడీఎస్‌ను రక్షించుకునేందుకు టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవికుమార్ అన్నారు. బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలన్నారు. 25వ తేదీన పాల్వంచ పాత ఆర్డీఓ కార్యాలయం రోడ్డులో నిర్వహించే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ కె.సత్య, పండగ వెంకటరమణ, రాజ్యలక్ష్మి, రమ్య, చుక్కమ్మ, సురేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ఖాళీ బిందెలతో నిరసన


బిందెలతో నిరసన తెలుపుతున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులలో తాగునీరు రాక ప్రజలు ఇబ్బంది పడుతుంటే అధికారులు పట్టించుకోని తీరును నిరసిస్తూ బుధవారం పోస్టాఫీస్ సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో బాధితులు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ వై.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ... ఏళ్ల తరబడి పట్టణ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతుంటే మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు, ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మొక్కల కోసం మున్సిపాలిటీ సుమారు రూ.6 కోట్లు ఖర్చు చేసిందని కానీ లెక్కలు లేవన్నారు. మొక్కలపై ఉన్న శ్రద్ధ ప్రజల దాహార్తిపై లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, నేరెళ్ల సమైక్య, నేరెళ్ల శ్రీనివాస్, మిరియాల సుధాకర్, దామెర ప్రసాద్, జ్ఞానేశ్వర్, వెంకన్న, భవానీ, విజయ, శ్రీనివాస్, లక్ష్మి, రాజు పాల్గొన్నారు.

ఏరియాను సందర్శించిన డీజీఎం


బొగ్గు ఉత్పత్తి, రవాణాను పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్‌ఓసీ, కిష్టారం ఓసీ, గనులను బుధవారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సౌత్ జోన్ రీజియన్–1 హైదరాబాద్ కమలేష్‌కుమార్, డీఎంఎస్ (మైన్స్) ఉమేష్ మధుకర్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈ రెండు ఓసీలలో బొగ్గు ఉత్పత్తి, రవాణాను వ్యూ పాయింట్ ద్వారా పరిశీలించారు. తదుపరి వారు మాట్లాడుతూ.. గనుల్లో ఉత్పత్తి ప్రధానం కాదని రక్షణ ప్రథమమని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం కల్పించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా రక్షణ చర్యలపై పర్యవేక్షించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు సేఫ్టీ అధికారుల బాధ్యత ఉందన్నారు. అనంతరం ఓసీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం జక్కం రమేష్, సేఫ్టీ జీఎం గురవయ్య, రీజియన్ సేఫ్టీ కుమారస్వామి, ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, జేవీఆర్‌ఓసీ పీఓ వెంకటాచారి, కిష్టారం ఓసీ పీఓ నరసింహారావు, సేఫ్టీ మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల జిల్లా ఖ్యాతిని పెంచింది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు


టేకులపల్లి: ఎమ్మెల్యే నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆశా వర్కర్ స్వరూప

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో జిల్లా ఖ్యాతి పెరిగిందని, ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కేఎస్‌ఎం ఏరియా మెడికల్ కళాశాలలో వైద్య, ఆరోగ్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వైద్య, ఆరోగ్య సిబ్బంది చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి, ప్రజలకు వైద్యం చేరువ చేసిందన్నారు. అనంతరం ఉత్తమ వైద్యులు, నర్సులు, ఆశా కార్యకర్తలు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌ఎల్.లక్ష్మణరావు, జిల్లా సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుకృత, పాల్వంచ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మోకాళ్ల వెంకటేశ్వరరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం వైద్య ఆరోగ్య విజయోత్సవ వేడుకలు ఇల్లెందులో జరిగాయి. ఉత్తమ సేవలు అందించిన సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పని చేస్తున్న ఎనిమిది మంది వైద్య సిబ్బందికి ఎమ్మెల్యే బానోతు హరిప్రియ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

ఇల్లెందు: తెలంగాణ స్వరాష్ట్రం ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ పేదల ఆరోగ్యం కోసం పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. బుధవారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష్‌కుమార్, ఆర్‌ఎంఓ హర్షకుమార్, బన్సీలాల్‌ల ఆధ్యక్షతన జరిగిన తెలంగాణ వైద్య ఆరోగ్య సంబురాలను ఆమె ప్రారంభించారు. ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. 70 ఏళ్లలో జరగని అభివృద్ధిని తొమ్మిదేళ్లలో పూర్తి చేశామన్నారు. అనంతరం కేసీఆర్ కిట్లు, న్యూట్రిషియన్ కిట్లు, ఆశాలకు చీరెలు పంపిణీ చేశారు. ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దిండిగల రాజేందర్, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, సయ్యద్ జానీపాషా, కమిషనర్ అంకుషావలీ పీహెచ్‌సీ డాక్టర్లు పాల్గొన్నారు.